సాక్షి
తిరుపతి

బుధవారం । 3 । జూలై । 2024



దారిదోపిడీ ముఠా అరెస్ట్

రాత్రివేళ ఒంటరిగా వెళ్తున్న వారిని టార్గెట్ చేసి దారిదోపిడీకి పాల్పడే ఏడుగురు ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



అమ్మా.. నన్ను క్షమించండి!

బీటెక్ ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైన విద్యార్థి మిద్దెపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. - 8లో



'నేను బడికి పోతా'

'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని ఎంఈఓలు, హెచ్ఎంలు విజయవంతం చేయాలని డీఈఓ శేఖర్ పిలుపునిచ్చారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు గేట్ కళాశాలలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ చిగురువాడ గేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, సత్య ఇన్ఫోటెక్ సంయుక్త ఆధ్వర్యంలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువున్న విద్యార్థుల కోసం బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రముఖ ఎమ్ఎన్‌సీ కంపెనీకి చెందిన ప్రతినిధులు కస్టమర్ సర్వీస్ అడ్వైజర్, డిజిటల్ చాట్ అసోసియేట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు మరిన్ని వివరాలకు 9000854841, 9985979770, 8885714841 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

సలహా మండలి సమావేశాలు రద్దు

తిరుపతి అర్బన్: జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. మరోవైపు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసింది. ఆ మేరకు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. గత ప్రభుత్వంలో వ్యవసాయ రంగంలో ఎప్పటికప్పుడు సాంకేతిక మార్పులను తీసుకురావడానికి, అన్నదాతలకు అమూల్యమైన సలహాలు ఇవ్వడానికి మూడు దశల్లో సలహా మండలి సమావేశాలు నిర్వహించేలా కొత్త సంస్కరణ తీసుకొచ్చారు. దీంతో రైతులకు సేద్యం చేయడానికి అవసరమైన అన్ని సలహాలు అందించేవారు.

డిగ్రీ ప్రవేశాల రిజిస్ట్రేషన్‌కు 10న ఆఖరు

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీస్వామి విద్యాప్రకాశనంద పురుషుల డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థులు ఓఏఎండీసీ పోర్టల్‌లో ఈ నెల 10వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత కోరారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రిజిస్ట్రేషన్ అనంతరం 11 నుంచి 15వ తేదీ వరకు కోర్సుల ఎంపిక.. 19న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. అర్హత పొందిన విద్యార్థులు 20వ తేదీ నుంచి కళాశాలలో రిపోర్టు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440167239, 7780390914 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం రేపు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు మంగళవారం టీటీడీ అధికారులు తెలిపారు.. శ్రీవారి సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు జూలై 10 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న విషయం తెలిసిందే. ఈ ఉత్సవానికి ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా గురువారం తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం.. అనంతరం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. ఈ సందర్భంగా గురువారం జరగనున్న తిరుప్పావడసేవ, ఆర్జిత కల్యాణోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది.

చంద్రగిరిలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్



రామిరెడ్డిపల్లిలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

చంద్రగిరి: చంద్రగిరి జమండ్ల వీధి, రామిరెడ్డిపల్లిలోని నూతన సచివాలయంలో మంగళవారం స్విమ్స్, శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో పింక్ బస్ మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. కొత్తపేటలో గల రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం భవనంలో, అదేవిధంగా రామిరెడ్డిపల్లిలో గల సచివాలయంలో ఈ క్యాంపులు నిర్వహించారు. ఇందులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కాగా, గురువారం కందులవారిపల్లి, చంద్రగిరి, జూలై 5న ఏ.రంగంపేట, నరసింగాపురంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. స్విమ్స్ శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, స్థానిక వైద్య సిబ్బంది, ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

షాడో ఎమ్మెల్యేలు!



మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ అదితి సింగ్‌తో కలసి సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్న కొడుకు శివకుమార్

వాళ్లు ఎమ్మెల్యేలు కాదు. కనీసం పంచాయతీ వార్డు సభ్యులు, మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లు కూడా కాదు. వారికి ఉన్న హోదా ఒక్కటే. ఒకరు ఎమ్మెల్యే అన్న కొడుకు అయితే.. మరొకరు ఎమ్మెల్యే భార్య మాత్రమే. ఇప్పుడు ప్రభుత్వ కార్యక్రమాల్లో వారిదే హవా. ప్రభుత్వ నిధులతో చేపట్టే ఏ కార్యక్రమం అయినా సరే ఈ షాడో ఎమ్మెల్యేలు పాల్గొంటూ అడ్డదిడ్డంగా అధికారులకు ఆదేశాలిస్తున్నారు. ప్రజలచేత ప్రత్యక్షంగా ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధులను సైతం సభావేదికలపై పక్కన నిలబెట్టి కుర్చీల్లో పాగా వేస్తున్నారు. ఐఏఎస్ స్థాయి అధికారులతోనూ సమీక్షలు నిర్వహిస్తూ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. అది ఎక్కడ.. ఎవరు.. ఎలా.. అంటారా..? అయితే మీరే చదవండి!

పదవి ఒకరిది..పెత్తనం మరొకరిది!

- తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో వింత పరిస్థితులు
- షాడో ఎమ్మెల్యేల తీరుతో తలలుపట్టుకుంటున్న అధికారులు
- అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ అడ్డదిడ్డంగా ఆదేశాలు

సాక్షి తిరుపతి టాస్క్‌ఫోర్స్: రాజకీయాల్లో కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. ఎమ్మెల్యేలు ఒకరైతే పెత్తనం చలాయించడానికి షాడోలుగా కుటుంబ సభ్యులు మారిపోతున్నారు. అధికారిక కార్యక్రమాల్లో సైతం దర్జాగా పాల్గొంటూ అధికారులను బెంబేలెత్తిస్తున్నారు. తామే సుప్రీం అంటూ.. మేము చెప్పిందే ఫైనల్ అంటూ హుకుం జారీచేస్తున్నారు. అధికారంలోకి వచ్చి నెలరోజులు గడవక ముందే తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ప్రజలకు వింత పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఎలాంటి హోదా లేకున్నా గ్రామసభలు మొదలు.. ఐఏఎస్ స్థాయి అధికారులతో సైతం సమీక్షలు జరుపుతూ కనుసైగతో పాలనను తమ గుప్పిట్లో పెట్టుకోనేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎమ్మెల్యేల బంధువుల పెత్తనాన్ని అధికారులు విధిగా భరిస్తున్నారు. వీరి తీరును చూసి ప్రజలు విస్తుపోతున్నారు. రాజకీయ విశ్లేషకులు సైతం షాడో ఎమ్మెల్యేల తీరుపై విమర్శలు గుపిస్తున్నారు.

చంద్రగిరిలో వింత పరిస్థితి



సోమవారం మంగళంలో మాట్లాడుతున్న సుధారెడ్డి

మహిళలు ప్రజాప్రతినిధులుగా ఉన్న చోట వారి భర్తలు అధికారం చలాయించడం ఇప్పటి వరకు చూసి ఉంటారు. అయితే చంద్రగిరిలో అందుకు విరుద్ధంగా వింత పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని భార్య సుధారెడ్డి సోమవారం మంగళంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొనడం విస్మయానికి గురిచేస్తోంది. ఆమె అతిథిగా హాజరై ఏకంగా రాజకీయ ప్రసంగం చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆమె సభావేదికపై కూర్చొని ఉండగా ఎన్నికల్లో గెలిచిన వార్డు మెంబర్లు పక్కన నిలబడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎమ్మెల్యే స్థానంలో ఆయన భార్య అధికారిక సభల్లో పాల్గొనడం జిల్లాలో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఈ కొత్త సంస్కృతికిని అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎమ్మెల్యే నానినా లేదా ఆయన భార్య సుధారెడ్డా అనే అంశంపై అంతా గుసగుసలాడుతున్నారు.

రోజూ తనిఖీలు చేస్తా!

- ఏరియా ఆస్పత్రిలో బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి హల్‌చల్
- సిబ్బందిపై చిందులు
- నిర్వహణ సరిగా లేదంటూ అసహనం



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న బొజ్జల బృందమ్మ

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : 'ఆలూ లేదు.. చూలూ లేదు.. కొడుకు పేరు సోమలింగం..' అన్నట్టు ఉంది శ్రీకాళహస్తిలో బొజ్జల బృందమ్మ పరిస్థితి. తెలుగుదేశం పార్టీలో ఆమెకు ఏ హోదా లేకపోయినా రెచ్చిపోతున్నారు. ఒక్క ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి హోదాతో హల్‌చల్ చేస్తున్నారు. ఇటీవల తన కుమారుడు బొజ్జల సుధీర్‌రెడ్డి విజయం సాధించినప్పటి నుంచి శ్రీకాళహస్తిపై పట్టు సాధించేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. తన కుమారుడు హైదరాబాద్‌లో మకాం వేయగా.. స్థానికంగా ఆమె పాగా వేస్తున్నారు. సమావేశాలు, పింఛన్ల పంపిణీ, గోశాల, ఆస్పత్రుల్లో తనిఖీలు ఇలా ఎక్కడ చూసినా ప్రత్యక్షమైపోతున్నారు. సభలు, సమావేశాల్లో ప్రజాప్రతినిధులను నిలబెట్టి ప్రసంగాలు దంచేస్తున్నారు. తాజాగా మంగళవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. పారిశుద్ధ్యం బాగోలేదంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న సిబ్బందిపై చిందులు తొక్కారు. బల్లలు, కుర్చీలు చిలుము పట్టి ఉన్నాయని, నిర్వహణ సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు తనిఖీ చేశానని, ఇక ప్రతిరోజూ ఆస్పత్రిని తనిఖీ చేస్తానని అక్కడి వైద్యులు, సిబ్బందిని హెచ్చరించారు. పనిచేసే సిబ్బందిని పెట్టుకుంటామన్నారు. ఓపీ తగ్గిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే అన్న కొడుకు చేతిలో తిరుపతి

తిరుపతి ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసులు గెలుపొందిన విషయం అందరికీ తెల్సిందే. అధికారంలోకి వచ్చిన మరునాటి నుంచే తిరుపతిని ఆయన అన్న కొడుకు ఆరణి శివకుమార్ తన చెప్పుచేతల్లో పెట్టుకునేందుకు ప్రయత్నించారు. ఇందుకు తగ్గట్టే కార్యకలాపాల వ్యవహారాల బాధ్యతలను తన అన్న కొడుకైన శివకుమార్‌కు అప్పగించారనే ప్రచారం జరుగుతోంది. అధికారుల బదిలీల మొదలు కాంట్రాక్ట్ వర్క్స్, ఇతర లావాదేవీలపై ప్రధానంగా దృష్టి సారించారు. నియోజకవర్గ పరిధిలోని అధికార యంత్రాంగం అంతా ఆయన్ని ప్రసన్నం చేసుకునే పనిలో పడింది. ఇదిలా ఉంటే గడిచిన రెండు రోజులుగా ఆరణి శివకుమార్‌కు ఎలాంటి హోదా లేకపోయినా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం తీవ్ర దుమారాన్ని రేపింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఐఏఎస్ అధికారిణి అదితిసింగ్ సమక్షంలోనే సమీక్షను నిర్వహించడం చర్చించనీయశమైంది. ఏకంగా కమిషనర్ పక్కనే ప్రత్యేక కుర్చీలో కూర్చుని అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇక అంతా తానేనని.. తాను చెప్పిందే శాసనం అంటూ రివ్యూ ద్వారా చాటిచెప్పాడు. ఇలానే మరో నలుగురు వ్యక్తులు ఎమ్మెల్యే బంధువులమంటూ విభాగాలవారీగా అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ప్రధానంగా ఇంజినీరింగ్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, పబ్లిక్ హెల్త్ విభాగాల్లో వీరి పెత్తనం మరింత ఎక్కువవుతోంది. ప్రతి రోజూ విభాగాధిపతుల వద్దకు వెళ్లి ఎమ్మెల్యేకు తాము సమీప బంధువులమంటూ హల్‌చల్ చేస్తున్నారు. అంతేకాకుండా మార్పులు, చేర్పులపై ఆదేశాలు ఇస్తున్నారు. దీంతో అధికారులు ఎవరి మాట వినాలో తెలియక తికమకపడుతున్నారు.

తిరుపతిలో షాడో వ్యవహారాలు మానుకోవాలి

> తిరుపతి నగరంలో ఎమ్మెల్యే తన బంధువులు, కుమారులను పంపి సమీక్షలు నిర్వహించడం మానుకోవాలి. ఏ హోదా లేకపోయినా ఉన్నత స్థాయి అధికారులతో కూర్చుని మాట్లాడడం సబబుకాదు. ఇలాంటి కొత్త సంస్కృతి తిరుపతిలో అమలు చేయడం మంచిది కాదు.
>
> – కందారపు మురళి, సీపీఎం, తిరుపతి

తిరుమల నడక మార్గంలో పటిష్ట భద్రత

- టీటీడీ ఈఓ జే.శ్యామలరావు



మాట్లాడుతున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుపతి (అలిపిరి): అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో వెళ్లే భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని టీటీడీ ఈఓ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం తిరుపతి శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో ప్రభుత్వ అటవీ, టీటీడీ అటవీ, ఇంజినీరింగ్, భద్రతా విభాగాలతో కాలిబాట భక్తుల భద్రతా చర్యలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ట్రాప్ కెమెరాలే కాకుండా చిరుతలు, ఇతర జంతువుల సంచారం తెలుసుకొనేందుకు మరిన్ని ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి ఏడో మైలు వరకు సంచరించే జంతువుల కదలికలు ఎప్పటి కప్పుడు కంట్రోల్ రూంకు తెలిసేలా సిగ్నలింగ్ వ్యవస్థను మెరుగుపరిచాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సంయుక్త కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలు చాలా ఖర్చుతో కూడుకున్నవని.. కమిటీ వారికి తక్కువ ఖర్చుతో అయ్యే నిర్మాణాలను, ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని వారికి ఉత్తరం రాయాలని అధికారులను ఆదేశించారు. కాలినడక మార్గంలో ఏ సమయాల్లో భక్తుల రాకపోకలు అధికంగా ఉంటాయి.. ఏ సమయాల్లో చిరుతలు ఈ ప్రాంతంలో తిరుగుతున్నాయి.. తదితర సమాచారాన్ని అటవీ అధికారులు పీపీటీతో తెలిపారు. కాలినడక భక్తులకు నిర్దేశించిన సమయాల్లోనే తిరుమలకు చేరుకునేలా, ఆ సమయాల్లో మార్పులు చేయాలని ఈఓ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు సంబంధించిన అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకోవాలని జేఈఓ వీరబ్రహ్మం, సీవీ అండ్ ఎస్వో నరసింహ కిషోర్‌కు సూచించారు. సమావేశంలో ఎస్వీ జూ పార్క్ క్యూరేటర్ సెల్వం, తిరుపతి డీఎఫ్ఓ సతీష్, సబ్ డీఎఫ్ఓ శ్రీనివాస్, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ– 2 జగదీశ్వర్‌రెడ్డి, టీటీడీ డీఎఫ్ఓ శ్రీనివాస్, పంచాయతీ ప్రత్యేక అధికారి మల్లికార్జున్, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి కలెక్టర్‌గా

డాక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి అర్బన్: ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఏపీ సెకండరీ హెల్త్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సలిజమాల వెంకటేశ్వర్‌ను తిరుపతి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. రేపో మాపో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తూ ఇటీవల ప్రవీణ్‌కుమార్ బదిలీ కావడంతో జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్రకు ఇన్‌చార్జి కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో తిరుపతి జిల్లాకు మొదటి కలెక్టర్‌గా వెంకటరమణారెడ్డి, రెండో కలెక్టర్‌గా లక్ష్మీశ, మూడో కలెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్ పనిచేశారు. నాల్గువ కలెక్టర్‌గా వెంకటేశ్వర్ పూర్తి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈయన 2020లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా (హౌసింగ్) పనిచేశారు. ఈ క్రమంలో జిల్లాపై ఆయనకు పట్టు ఉంది. రైతు కుటుంబానికి చెందిన ఈయన తండ్రి వెంకటయ్య సర్పంచ్‌గా పనిచేశారు. ఒంగోలు జిల్లా, కోమలూరు మండలం, ఇడమకల్లు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్ 1 నుంచి 10వ తరగతి వరకు లయోల పాఠశాల(గుంటూరు)లోను, ఇంటర్మీడియెట్ శ్రీచైతన్య(వైజాగ్), ఎంబీబీఎస్(ఆంధ్రా మెడికల్ కళాశాలలో 2012లో) పూర్తిచేశారు. అనంతరం ఢిల్లీకి వెళ్లి ఐఏఎస్ కోసం శిక్షణ పొందారు. 2013లో తొలిసారి 889వ ర్యాంక్ వచ్చింది. ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యారు. తర్వాత 2014లో డిఫెన్స్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. 2015లో మూడోసారి సివిల్స్‌లో 216వ ర్యాంక్ సాధించారు. దీంతో 2016లో ఐఏఎస్ బ్యాచ్‌కి ఎంపికయ్యారు. 2017లో అనంతపురం జిల్లా ట్రైనీ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ పొందారు. 2018లో పాడేరు సబ్‌కలెక్టర్‌గా పనిచేశారు. 2019లో పాడేరు ఐటీడీఏ పీఓగా విధులు నిర్వహించారు. 2020లో చిత్తూరు జిల్లా హౌసింగ్ జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. 2022 తర్వాత ఏపీ సెకండరీ హెల్త్ డైరెక్టర్‌గా పనిచేస్తూ తిరుపతి జిల్లా కలెక్టర్‌గా బదిలీపై రానున్నారు.

డీఎడ్ అభ్యర్థులకు మొండిచెయ్యి

- తూతూమంత్రంగా డీఎస్సీ ఉచిత శిక్షణ
- 30వేల మంది బీఈడీ అభ్యర్థుల్లో 200 మందికి మాత్రమే అవకాశం
- నేటి నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- ఈనెల 15 నుంచి 60 రోజుల పాటు ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్: డీఎస్సీ పోటీ పరీక్షకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణలో డీఎడ్ అభ్యర్థులకు మొండిచెయ్యి చూపించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 52 వేల మందికి పైగా బీఈడీ అభ్యర్థులు, 13 వేల మందికి పైగా డీఎడ్ అభ్యర్థులు ఉన్నారు. వీరంతా త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ పరీక్షకు సిద్ధమవుతున్నారు. ఇందులో 30 వేల మంది బీఈడీకి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు ఉన్నారు. ఏడు వేల మంది డీఎడ్ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ బీసీలు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం డీఎడ్ చేసిన వారికి ఉచితంగా శిక్షణ ఇవ్వకుండా చేతులెత్తేసింది. మరోవైపు బీఈడీ చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు 30 వేల మంది ఉంటే.. వారిలో 200 మందికి మాత్రమే ఉచిత శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఆ మేరకు దరఖాస్తులు ఆహ్వానించడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. బీఈడీలో మెరిట్ ఆధారంగా మొదటి 200 మందిని తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీకి ఉచిత శిక్షణ

తిరుపతి ఎమ్మార్‌పల్లి సర్కిల్ వద్ద ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు కలెక్టర్ ధ్యానచంద్ర మంగళవారం తెలిపారు. ఆ మేరకు బుధవారం నుంచి ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. అయితే 200 మందిని మాత్రమే ఎంపిక చేస్తామని, వారికి ఈ నెల 15వ తేదీ నుంచి 60 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణతోపాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. బీఈడీలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు తమ ప్రొవిజనల్ సర్టిఫికెట్‌తోపాటు పదోతరగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంక్ పాస్ పుస్తకం, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు బీసీ స్టడీ సర్కిల్‌లో 4-171-2 మొదటి క్రాస్, శ్రీకృష్ణ నగర్, ముత్యాలరెడ్డిపల్లిలో అందజేయాలని కోరారు. వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు ఉండాలని స్పష్టం చేశారు. అదనపు సమాచారం కోసం 9346221553, 9490733351, 9441456039 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.74,070
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,652
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.90,500
రిటైల్ వెండి గ్రాము	రూ.92.50

క్లుప్తంగా

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



చిన్నారిని జ్ఞాపికతో సత్కరిస్తున్న ప్రిన్సిపల్

గూడూరురూరల్: గూడూరు పట్టణానికి చెందిన విద్యార్థిని జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు కావడంతో సాయి విద్యానికేతన్ పాఠశాల ప్రిన్సిపల్ శ్రావణి తెలిపారు. స్థానిక పాఠశాలలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్న మేధీసింగ్ అనే విద్యార్థిని ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో అండర్ -13 విభాగంలో పాల్గొని ప్రతిభకనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈ మేరకు విద్యార్థినిని అభినందించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తడ: మండల పరిధిలోని అక్కంపేట రైల్వే స్టేషన్ సమీపం, గ్రద్దగుంట కాలనీ వద్ద మంగళవారం జరిగిన రైలు ప్రమాదంలో సుమారు 50 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు సూళ్లూరుపేట జీఆర్పీ ఎస్ఐ కే.కొండప్పనాయుడు తెలిపారు. తెలుపు రంగు చొక్కా, ఎరుపు రంగు పంచె ధరించిన ఇతని వద్ద పసుపు రంగు గుడ్డ సంచి ఉండడంతో ఇతను తమిళనాడుకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు సూళ్లూరుపేట జీఆర్పీ ఓపీ కార్యాలయంలో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

ఘాట్ రోడ్డులో మంటలు

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్‌లోని 31వ మలుపు వద్ద మంగళవారం సాయంత్రం మంటలు అంటుకున్నాయి. విషయం తెలుసుకున్న టీటీడీ విజిలెన్స్, అటవీశాఖ అధికారులు ఆ మంటలను త్వరితగతిన అదుపు చేశారు. మలుపుల వద్ద శ్రీవారి భక్తులు కర్పూరం అంటించడం వల్లే మంటలు వ్యాపించినట్లుగా విజిలెన్స్ అధికారులు గుర్తించారు.

విద్యుత్ బిల్లులు.. మారిన చెల్లింపులు

- ఎస్పీడీసీఎల్ సైట్‌లో కట్టే అవకాశం
- యూపీఐ యాప్‌లకు చెక్ పెట్టిన ఆర్‌బీఐ

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ బిల్లులను ఇకపై సంస్థకే నేరుగా చెల్లించాలని ట్రాన్స్‌కో ప్రకటించింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఏపీఎస్పీడీసీఎల్ సైట్ లేదా ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌లో మాత్రమే బిల్లు పేమెంట్ చేయాలని స్పష్టం చేసింది. యూపీఐ యాప్‌లైన గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ఇతరత్రా వాటిలో బిల్లు చెల్లించే ఆప్షన్‌ను నిలిపివేసినట్లు వెల్లడించింది. విద్యుత్‌శాఖ కార్యాలయానికి నేరుగా వెళ్లి చెల్లిస్తే మేలని వినియోగదారులకు సూచిస్తోంది.

ఆర్‌బీఐ నిబంధనలు

సమయపాలన పాటిస్తూ గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి కరెంటు బిల్లులు కట్టే కాలం పోయింది. గతంలో కంటే ప్రస్తుతం ఆన్‌లైన్ వాడకం పెరిగింది. ఎల్‌టీ సర్వీసులు అధిక భాగం బిల్లులు మొత్తం ఆన్‌లైన్‌లోని యూపీఐ ద్వారా చెల్లిస్తున్నారు. మొదట్లో లావాదేవీలను ప్రోత్సహించాలని యాప్‌లో సర్వీసు చార్జీలు వసూలు చేసేవారు కాదు. కానీ, గత ఏడాది నుంచి నామమాత్రపు చార్జీలను యూపీఐ యాప్ నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. అయితే జూలై 1 నుంచి యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులకు లైసెన్స్ అవసరమని ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా యాప్‌ల యాజమాన్యాలు లైసెన్స్ పొందేందుకు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఆర్‌బీఐ ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం బిల్ పేమెంట్ ఆప్షన్‌ను తొలగించేశాయి.

కారణం ఇదీ..

ఆన్‌లైన్ చెల్లింపుల్లో మూడో పార్టీ యాప్స్ అయిన ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం ఇతరత్రా వాటిలో కరెంటు బిల్లు కడితే విద్యుత్ సంస్థకు డబ్బులు చేరడానికి మూడు రోజులు సమయం పడుతోంది. అలాగే కొన్ని పేమెంట్స్ పలు కారణాలతో నిలిచిపోతున్నాయి. దీంతో ప్రత్యక్షంగా విద్యుత్ సంస్థకు డబ్బులు చేరడం ఆలస్యమతోంది. అదే ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో బిల్లు చెల్లిస్తే నేరుగా సంస్థ ఖాతాలోకే వస్తోంది. దీంతో యూపీఐ యాప్స్‌లో నగదు చెల్లించినా, నేరుగా ఎస్పీడీసీఎల్ ఖాతాలో జమ కావాలని ఆర్‌బీఐ నిబంధన విధించింది. అందులో భాగంగా యాప్స్ యాజమాన్యాలు పలు అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అవి పూర్తయ్యాక పాత విధానం అందుబాటులోకి వచ్చే అవకాశముంది.



ప్రత్యక్ష చెల్లింపులు చేయాలని విద్యుత్‌శాఖ సమాచారం

75 శాతం ఆన్‌లైన్

జిల్లాలో గృహ, వాణిజ్య సర్వీసులు దాదాపు 14.50 లక్షల వరకు ఉన్నాయి. ఇవి కాకుండా హెచ్‌టీ, పరిశ్రమల సర్వీసులు 50 వేల వరకు వినియోగిస్తున్నారు. మొత్తం విద్యుత్‌బిల్లుల ద్వారా జిల్లాలో నెలకు రూ.320 కోట్లు వస్తోంది. ఇందులో రూ.129 కోట్లు గృహ, వాణిజ్య సర్వీసులు ద్వారా మిగిలిన రూ.191 కోట్లు పరిశ్రమలు, హెచ్‌టీ సర్వీసుల ద్వారా వస్తోంది. పరిశ్రమల చెల్లింపులు బ్యాంకు ద్వారా చేస్తున్నారు. మిగిలిన వాటిలో 60 శాతం మంది ఆన్‌లైన్ ద్వారా కడుతున్నారు. జిల్లాలో 8.70 లక్షల సర్వీసుల బిల్లులు దాదాపు రూ.77.50 కోట్లు ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారానే వస్తోంది.

ఆ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులను చెల్లించండి



ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్ పీడీసీఎల్) పరిధిలోని వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఏపీఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్ (సదరన్ పవర్) లేదా వెబ్సైట్ www. apspdcl.in ద్వారా చెల్లించాలి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మార్గదర్శకాల మేరకు ఇకపై వినియోగదారులు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎమ్‌లతోపాటు ఇతర యూపీఐ యాప్స్ ద్వారా నేరుగా విద్యుత్ బిల్లులను చెల్లించే అవకాశం లేదు. ఏపీఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్ లేదా వెబ్‌సైట్ www.apspdcl.in ద్వారా బిల్ డెస్క్‌కు అనుసంధానమైన ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎమ్ లతోపాటు ఇతర యూపీఐ యాప్స్ నుంచి బిల్లులను చెల్లించవచ్చు. వీటితోపాటు వినియోగదారులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, వాలెట్, క్యాష్ కార్డుల ద్వారా కూడా విద్యుత్ బిల్లును చెల్లించవచ్చు.

– సంతోష్‌రావు, ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్

అమ్మా.. నన్ను క్షమించండి!

- బీటెక్‌లో ఫెయిల్ అయిన ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య
- చెర్లోపల్లిలో విషాదం

తిరుపతి రూరల్: 'అమ్మా.. నన్ను క్షమించండి.. నేను చనిపోతున్నా' అంటూ బీటెక్‌లో ఫెయిల్ అయిన ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. మృతుడు తండ్రి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు... తిరుపతి రూరల్ మండలం, చెర్లోపల్లికి చెందిన గురుకళ్యాణ్ (20) రంగంపేట సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. గత నెలలో పరీక్షల రిజల్ట్ వచ్చింది. ఇందులో కొన్ని సబ్జెక్టుల్లో గురు కళ్యాణ్ ఫెయిల్ అయ్యాడు. అప్పటి నుంచి మనస్తాపంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం షాపుకు వెళ్లొస్తానని ఇంటి నుంచి బయటకు వచ్చాడు. సమీపంలోని కొత్తగా నిర్మిస్తున్న శ్రీవారి విడిది భవనాల పైకి వెళ్లి మూడో అంతస్తు నుంచి సెల్ఫీ తీసుకొని తన తల్లికి పంపించాడు. 'అమ్మా...నన్ను క్షమించండి' అంటూ మెసేజ్ చేసి మూడో అంతస్తు నుంచి కిందకి దూకాడు. కుమారుడి మెసేజ్‌తో ఆందోళన గురైన తల్లిదండ్రులు అక్కడికి వెళ్లి చూడగా రక్తపు మడుగులో గురు కళ్యాణ్ పడి ఉన్నాడు. వెంటనే చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తిరుపతి రూరల్ పోలీసులు తెలిపారు.


గురు కళ్యాణ్(ఫైల్)

గంజాయి కేసులో ఇద్దరి అరెస్ట్

సత్యవేడు: అక్రమంగా గంజాయి తరలిస్తున్న కేసులో సత్యవేడు పంచాయతీకి చెందిన ఎం.కుమార్(25) గంగమిట్ట వీధి, సత్యవేడు దళితవాడకు చెందిన ఆర్.కలియప్ప(22)ను అరెస్ట్ చేసినట్టుసీఐ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మంగళవారం ఉదయం కాళమనాయుడుపేట చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పల్సర్ బైక్ పై వచ్చిన ఇద్దరు యువకులు పారిపోయేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు ఇరువురినీ అడ్డగించి తనిఖీ చేయగా బైక్ ట్యాంకు కవర్‌లో ఒక కిలో గంజాయి ఉండడం గుర్తించి ఇద్దరినీ అదుపులోకి తీసుకొని తహసీల్దారు వద్ద హాజరు పరిచారు. విచారణలో యువకులు సూళ్లూరుపేట వెళ్లి అక్కడ గుర్తుతెలియని వ్యక్తు ద్వారా గంజాయి కొనుగోలు చేసి సత్యవేడు, తమిళనాడు ప్రాంతాల్లో విక్రయించేందుకు సిద్ధమైనట్టు తెలింది. కేసు దర్యాప్తులో ఉంది.

స్కౌట్స్ విద్యార్థులకు రాజ్యపురస్కార్ అవార్డులు


ఎస్.శ్రీనివాసులు, పీ.వినోద్, జే.లోకేష్, పీ.మురళీకృష్ణ, ఏ.యశ్వంత్

శ్రీకాళహస్తి: గుంటూరులోని తాడికొండలో ఉన్న రాష్ట్ర భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో ఈ ఏడాది ఏప్రిల్ 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన రాజ్యపురస్కార్ టెస్టింగ్ క్యాంపులో పాల్గొన్న శ్రీకాళహస్తి బాబూ అగ్రహారం పురపాలక సంఘ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు స్కౌట్ విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో పీ.వినోద్, పీ.మురళీకృష్ణ, ఎస్.శ్రీనివాసులు, ఏ.యశ్వంత్, జే.లోకేష్ ఉన్నారు. ఏడు రోజులపాటు నిర్వహించిన టెస్టింగ్ క్యాంపులో అవార్డులకు అర్హత సాధించారు. వీరికి రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అధ్యక్షులు అబ్దుల్ నజీర్ సంతకంతో కూడిన సర్టిఫికెట్స్ అందజేస్తారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఎస్‌కే.అజారుద్దీన్‌ను కమిషనర్లు ఎంఎం.రెడ్డి, రమేష్‌బాబు, జిల్లా కార్యదర్శి జయరాం, సహాయ కమిషనర్ పార్వతి, డీటీసీ సావిత్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్ప, ఉపాధ్యాయులు యోగానంద తదితరులు అభినందించారు.

సౌత్ జోన్ రెజ్లింగ్‌లో ప్రతిభ

తిరుపతి ఎడ్యుకేషన్ : జూన్ 28 నుంచి 30వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం, మేటూరులో సౌత్‌జోన్ అండర్–23 రెజ్లింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న వెదురుకుప్పం మండలం, మాంబేడు గ్రామానికి చెందిన కొణిదల హర్షిత 57 కిలోల విభాగంలో ప్రతిభ కనబరిచి కాంస్య పతకం, మట్టి కుస్తీ విభాగంలో వెండి పతకం సాధించింది. గత ఆరేళ్లుగా శాప్ రెజ్లింగ్ కోచ్ హిందూజ వద్ద శిక్షణ పొందిన హర్షిత ఇప్పటివరకు స్కూల్ గేమ్స్ పోటీల్లో, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో అనేక పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో జిల్లా క్రీడాధికారి సయ్యద్ సాహెబ్, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఆర్.శ్రీధర్, జిల్లా రెజ్లింగ్ సంఘం అధ్యక్షులు సురేష్, కోచ్ హిందూజలు హర్షితను ఘనంగా సత్కరించి అభినందించారు. భవిష్యత్‌లో జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.


కొణిదల హర్షితను అభినందిస్తున్న జిల్లా క్రీడాధికారి తదితరులు

విద్యాసంస్థల బంద్ పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి సిటీ: నీట్, నెట్ పరీక్షల లీకేజీపై సమగ్ర విచారణ జరపాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ విద్యార్థి సంఘాల పిలుపు మేరక గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నట్టు జిల్లా ఐక్యవిద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు మంగళవారం ఎస్వీయూ పరిపాలనా భవనం వద్ద బంద్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ గత ఐదేళ్లలో సుమారు 65 ప్రశ్నపత్రాలు లీకేజీ అయ్యాయని, కానీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థను కేంద్రం సర్వ నాశనం చేసిందని దుయ్యపట్టారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, నవీన్, ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శి అక్బర్, రవి, ఎన్ఎస్‌యూఐ నాయకులు మల్లికార్జున పాల్గొన్నారు.


బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐక్య విద్యార్థి సంఘ నాయకులు

దారిదోపిడీ ముఠా అరెస్ట్


నిందితులను అరెస్ట్ చూపుతున్న రేణిగుంట అర్బన్ సీఐ మల్లికార్జున


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు, బంగారు ఆభరణాలు

- ఏడుగురు నిందితుల అరెస్ట్
- 5 మోటార్ బైక్‌లు, 8 మొబైల్ ఫోన్లు, 8 గ్రాముల బంగారు స్వాధీనం

రేణిగుంట: రాత్రి వేళ ఒంటరిగా వెళుతున్న వారిని టార్గెట్ చేసి వారిపై దాడి చేసి, దారిదోపిడీకి పాల్పడుతున్న దొంగలముఠాను రేణిగుంట పోలీసులు చాకచక్యంగా పట్టుకుని వారి ఆటకట్టించారు. రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం సీఐ మల్లికార్జున ఆ వివరాలను విలేకరులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ గతవారం రేణిగుంట రైల్వేస్టేషన్ సమీపంలో రేణిగుంటకు చెందిన సురేష్ బాబుపై దాడిచేసి అతని వద్దనున్న బంగారు నగలు దోచుకున్నట్లు బాధితుని ఫిర్యాదుతో తాము దర్యాప్తు చేసినట్టు తెలిపారు. నిందితులను గుర్తించి వారి కదలికలపై నిఘా పెట్టామన్నారు. మంగళవారం ఏడుగురు దారిదోపిడీ ముఠా మండలంలోని కరకంబాడి పంచాయతీ, తారకరామనగర్ వద్ద ఉండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులు తిరుపతి మారుతీనగర్‌కు చెందిన ఎస్.జశ్వంత్(19), సంజీవయ్యనగర్‌కు చెందిన జీ.సతీష్(19), పాకాల మండలం శంఖంపల్లికి చెందిన జీ.దిలీప్(19), తిరుపతి కోలా వీధికి చెందిన వీ.జశ్వంత్(19), సిద్దే ప్రసన్నకుమార్(34), వడమాలపేట మండలం వడ్డేపల్లికి చెందిన వేముల చరణ్(19), తిరుపతి రఘునాథ రెడ్డి కాలనీకి చెందిన రియాజ్(19)గా గుర్తించారు. ఈ మేరకు వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

జల్సాలకు అలవాటు పడి

నిందితులంతా తిరుపతి, రేణిగుంట పరిసరాల్లో రాత్రి వేళ గంజాయిని సేవించి సినిమాలకు వెళ్లేవారు. అర్ధరాత్రి దాటాక, ఒంటరిగా వెళుతున్న వారిని గుర్తించి వారిని వెంబడించి దాడి చేసేవారు. ఆపై వారి వద్దనున్న నగదు, సెల్‌ఫోన్లు, బైక్‌లు, బంగారు ఆభరణాలు దోచుకుని వచ్చిన డబ్బుతో జల్సాలకు పాల్పడేవారన్నారు. ఈ మేరకు గత వారం రేణిగుంటలోని పలు చోట్ల సీసీ టీవీ రికార్డులను పరిశీలించి దారిదోపిడీలకు పాల్పడుతున్న ముఠాను గుర్తించామని సీఐ తెలిపారు. పక్కా సమాచారంతో మాటువేసి ఏడుగురి నిందితులను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. గతంలో వీరిపై తిరుపతి నగరంలోని పలు స్టేషన్లలో, తిరుచానూరు, తమిళనాడులోని పలు పోలీస్‌స్టేషన్లలో దొంగతనం కేసులున్నట్లు వివరించారు. నిందితుల నుంచి 5 మోటర్‌బైక్‌లు, 8 మొబైల్ ఫోన్లు, 8 గ్రాముల బంగారు చైన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఏడుగురికి రిమాండ్

తిరుపతి లీగల్: దారిదోపిడీ కేసులో ఏడుగురికి 15 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సత్యకుమార్ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. గత నెలలో రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి సమయంలో ఒంటరిగా వెళుతున్న వ్యక్తులను టార్గెట్ చేసుకొని ఏడుగురు వ్యక్తులు నగలు, డబ్బు,సెల్ ఫోన్లను అపహరించుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు రేణిగుంట పోలీసులు కేసు దర్యాప్తు చేసి, ఏడుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

'నేను బడికి పోతా'

విజయవంతం చేయండి


మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

నాయుడుపేట టౌన్: 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఈఓ వీ.శేఖర్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పట్టణంలోని ఎల్ఏ సాగరం ఉన్నత పాఠశాలలో మంగళవారం గూడూరు డివిజన్ పరిధిలోని ఏంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఓఈ మాట్లాడుతూ స్టూడెంట్స్ కిట్ల పంపిణీ సత్వరం పూర్తిచేయాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో చాలా పాఠశాలలు అలసత్వం వహిస్తున్నాయని చెప్పారు. మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉన్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే విద్యా సంవత్సరానికి 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా హైస్కూల్ ప్లస్‌లో విద్యార్థుల చేరికపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో గూడూరు ఇన్‌చార్జ్ డీఈఓ ఎం.శాంతి, అసిస్టెంట్ ఏఎంఓ మధు, హెచ్‌ఎం అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యాదర్శి మనోజ్‌కుమార్, ఎంఈఓలు బాణాలమునిరత్నం, లత, శెట్టిపల్లి మునిశేఖర్, గూడూరు డివిజన్ పరిధిలోని ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయ భూమిపై టీడీపీ కన్ను

- కబ్జాకు అడ్డుగా ఉందని వైఎస్ఆర్ సీపీ జెండా దిమ్మె ధ్వంసం
- జేసీబీతో చదును చేసి, రాళ్లు తోలిన టీడీపీ నాయకులు
- టీడీపీకి చెందిన ఓ మాజీ ఆర్మీ ఉద్యోగి నిర్వాకంపై స్థానికుల మండిపాటు


ఏసీ జిమ్ భవనం పక్కన చదును చేసిన ప్రభుత్వ భూమి


వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మె ధ్వంసం


కబ్జా స్థలాన్ని చదును చేసిన దృశ్యం

చంద్రగిరి: టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతలు రెచ్చిపోతున్నారు. చంద్రగిరిలో 30 ఏళ్ల తర్వాత టీడీపీ ఎమ్మెల్యే విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు మితిమీరుతున్నాయి. ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపించినా వాటిని కాజేసేందుకు ఆగమేఘాలపై పనులను ప్రారంభిస్తున్నారు. వివరాలు.. చంద్రగిరి కొత్తపేటలోని నూకలగుంట వద్ద ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం భూమిని కేటాయించింది. దీంతో ఆ భూమిలో గత ప్రభుత్వం సచివాలయం, ఆర్‌బీకే సెంటర్, వెల్‌నెస్ సెంటర్, కమ్యూనిటీ హాలు, ఏసీ జిమ్, యోగా ధ్యాన మందిర భవనాలను నిర్మించారు. ఆ ప్రాంతంలో మిగిలిన ఖాళీ భూమి భవిష్యత్తు అవసరాల కోసం రిజర్వు చేసి పెట్టారు. ప్రభుత్వ భవనాలు రావడంతో ఆ భూమి విలువ పెరిగిపోయింది. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోని ఖాళీగా భూమిపై టీడీపీ నేతల కన్ను పడింది. దీంతో స్థానికంగా ఉన్న ఓ చోటా నేతతోపాటు టీడీపీకి చెందిన ఓ విశ్రాంత ఆర్మీ ఉద్యోగి కబ్జాలకు తెరలేపినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. జేసీబీ సాయంతో రెండు రోజులపాటు అక్కడ ఉన్న చెట్లను తొలగించడంతో పాటు చదును చేశారు. ఆపై నిర్మాణం కోసం రాళ్లను సైతం దిగుమతి చేసుకున్నారు.

వైఎస్ఆర్ సీపీ జెండా దిమ్మె ధ్వంసం

ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు పాల్పడిన టీడీపీ నాయకులు అక్కడ ఉన్న వైఎస్ఆర్ సీపీ జెండా దిమ్మెను సైతం ధ్వంసం చేశారు. జేసీబీ సాయంతో దిమ్మెలను ధ్వంసం చేసి, ముళ్ల చెట్లలో పడేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ నాయకులు కబ్జాలకు పాల్పడడంపై స్థానికులు మండిపడుతున్నారు. గత ప్రభుత్వం ఈ ప్రాంతంలో ప్రభుత్వ భవనాలను తీసుకొచ్చి అభివృద్ధి చేసిందని, అయితే ప్రస్తుతం టీడీపీలో ఉన్న ఓ మాజీ సైనికుడితోపాటు మరికొంత మంది ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నించడం దారుణమంటూ మండిపడుతున్నారు. వైఎస్ఆర్ సీపీ జెండా దిమ్మెలను ధ్వంసం చేయడం సబబు కాదని, ఈరోజు వీళ్లు చేస్తే, రేపు ఆ పార్టీ వాళ్లు చెయ్యరా అని, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆ భూమి ప్రభుత్వానిదే

నూకలగుంట వద్ద ఉన్న ప్రభుత్వ భవనాల ఆవరణలోని ఖాళీ భూమి ప్రభుత్వ భూమేనని వీఆర్‌ఓ పురుషోత్తం స్పష్టం చేశారు. ఇక్కడ భవిష్యత్తు అవసరాల కోసం భూమిని రిజర్వ్ చేశామని తెలిపారు. ఆ ప్రభుత్వ కబ్జా చేస్తున్నారంటూ స్థానికులు ఫిర్యాదు చేయడంతో పనులను అడ్డుకోవడం జరిగిందన్నారు. కబ్జా విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.